# ఒకరిద్దరిలో ఒకరు

ఉగాదిని తలుచుకుంటేనే చాలు నా గుండెలో అమృతపు చినుకులు కురుస్తై.

పండగ పరిమళాన్ని పంచుకోబోయే అందంతోనూ కాదు, పిండివంటల రుచితో జిహ్వాని సంతృప్తి పరుస్తాననే కోరికతోనూ కాదు.

అవును-ఉగాదిని తలుచుకుంటే అవ్యక్తరాగాన్ని పాడుకుంటుంది మనస్సు. ఉగాది వస్తున్నదంటే మా ఉమాపతి గుర్తుకువస్తాడు. ఉమాపతి గుర్తుకు రాగానే - అరచేతిలో శ్రీ రాసి కళ్ళకద్దుకున్న భావన కలుగుతుంది.

గిలక్కాయరంగును చూసి తనలో తాను నవ్వుకునే పసిపిల్లవాడిలా, ఉమాపతి గుర్తుకొస్తే నాలో నేను నవ్వుకుంటాను. మురిసిపోతాను. ఆనందంతో గుండెలు పండించుకుంటాను ; అతను చెప్పిందీ, చేసిందీ కళ్ళముందు ఆడుతుంది.

ఉమాపతి గురించి చెప్తాను.

* * *

మెడ చుట్టూ చేతులు వేసి ' నా మాట వినరూ ' అంటూ గోముగా మరోసారి తన కోరికని కొసరింది, శారద.

అంతకు ముందు ఇలాంటి విన్నపాలు, విన్యాసాలూ చాలా జరిగినై.

" సరే–అలాగే వెళ్దాం కానీ. " అన్నాను. నేను మెత్త బడతానని తనకెలాగూ తెలుసన్నట్లు గర్వంగా, నా వైపు వో చూపు పారేసి - ' గుడ్‌బాయ్ ' అని మనస్సులో నాకొక 'కాంప్లిమెంట్' ఇచ్చుకుని - లోపలకి పోయి కాఫీ పట్టుకొచ్చింది

కాఫీ తాగుతూ ఉమాపతి రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకున్నాను.

" ప్రియమైన అన్నయ్యకు : నమస్సులతో,

నా నుంచీ నీకు ఇలా ఉత్తరం రావడం ఆశ్చరాన్ని కలిగించే విషయమే. ఉగాదికి రెండు రోజులు ముందుగా నేను మన వూరు చేరుతున్నాను. ఆనాటికి నువ్వూ వదినీ్న, పిల్లల్నీ తీసుకుని తప్పకుండా అక్కడికి రావాలని నా కోరిక. ఏదో రాసేనని అనుకోవద్దు. ఈ ఉగాది మన జీవితాలకి కొత్త మలుపు కాబోతోంది. నా కోరికని మన్నిస్తావని నమ్మకంతో - వుంటాను.
తమ్ముడు – ఉమాపతి "

మన ఊరు !

ఒక్కసారి మనస్సు గతంలోకి పరుగెత్తింది. ఇరవై తొమ్మిదేళ్ళ క్రితం–

అవును, అప్పట్లోకి అది మా ఊరు. అక్కడ పుట్టి, పదిహేనేళ్ళు ఆ గాలీ, నీరూ అనుభవించాను. ఆ మట్టిలో ఆడుకున్నాను. చెర్లో ఈతలు కొట్టాను. చెట్లమీద కోతికొమ్మచ్చులాడాను ; వినాయకుడికోసం కొమ్మలు విరిచేను ; ఉగాదికోసం వేపమండలు వంచాను ; వేణుగోపాలుడి గుడి ముఖమండపంలో కూర్చుని చదువుకున్నాను ; చదువుకుంటూ పద్యాలు రాశాను, పద్యాలు రాస్తూ చదువుకున్నాను. పడమటి పొలానికి పోయి తాటిచెట్లెక్కి - కాయలుకొట్టి - పందేలు పెట్టి - ముంజెలు తిన్నాను. ఈతగెలలు కోసి, గుంటలు తవ్వి పాతేసి పండబెట్టి- పంచుకున్నాను సెలవల్లో అడపాదడపా - బాబాయితోపాటు- అచ్చిరాని సేద్యంలో చెమటలు కక్కాను.

అప్పుడు అది నా ఊరు !

ఇరవైతొమ్మిదేళ్ళు ! - ఎంత సుదీర్ఘమైన విరామం ! ఇన్నేళ్ళకిన్నాళ్ళకి మళ్ళీ దాన్ని నాకు గుర్తుచేసి, అక్కడికి రమ్మని ఉమాపతి ఆహ్వానం !

నే నా ఊరు వదిలేసి వచ్చేనాటికి ఉమాపతి లొట్టికాయ ; పసినాపకు ఆరేళ్ళు నిండాయేలేదో - అంతే ! బాబాయికి ఒక్కగా నొక్క వలుసు. 'ఆ ఇంటి చాలే అంత. ఒక్కడు లేదా ఇద్దరు. అందరికీ అంతే' అనుకుంటూ వుండేవాళ్ళు - వూరి వాళ్ళు - నన్నూ, వాణ్ణీ చూపుతూ !

అమ్మకూ, పిన్నికీకూడా కళ్లు చెమర్చడం- నాకు గ్రాయకం వచ్చిన తర్వాత నేను అడపాదడపా - ఆ ప్రసక్తి వచ్చినపుడల్లా - గమనిస్తూనే వుండేవాణ్ణి.

నేను ఎనిమిదిలో వుండగానే నాన్న పోయాడు. ఆ లోటేమిటో వెంటనే తెలీలేదు.

ఊళ్ళో స్కూల్లోనే ఎస్సెల్సీ అయింది.

అప్పుడు కళ్ళు తెరిచి చుట్టూ చూస్తే - ఎన్నెన్నో రంగుల వలలు, చేదు నిజాలు !

రాత్రి - అన్నాలయ్యి ఆరుబయట పడుకున్నప్పుడు నిమ్మళంగా విషయం నా ముందు పెట్టింది అమ్మ - "ఇంతటితో చదువు మానేయమంటున్నాడు, మీ బాబాయి."

నేను వులిక్కిపడ్డాను. లేచి కూర్చున్నాను. ఏదో చెప్పబోయాను. మాట తడబడింది. చివరికి 'అదేవిటీ కాలేజీలో చేరదామనుకుంటుంటే' అని మాత్రం అన్నట్టు గుర్తు.

అమ్మ లేచి నా పక్కమీదికివచ్చి కూర్చుంది. నిమ్మళంగా నా తల నిమిరింది. ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగినై. "కాలేజీ అంటే మాటలా. పట్నంపోయి వుండాల. బోల్డంత ఖర్చు. డబ్బు కావద్దూ" అంది.

కుప్పకూలినట్లయింది నా పని. ఎస్సెల్సీలో స్కూలు ఫస్టుని. మాష్టర్లంతా 'తప్పకుండా కాలేజీలో చదివి పైకి రావాలి నువ్వు' అనే ఆశించారు. చాలా పుస్తకాలు బహుమతులుగా ఇచ్చి మెచ్చుకున్నారు. ఆకాశంలో పోయే విమానాన్ని చూసి చెయ్యి ఊపుతూ నిలబడి, ఆ ఆకారం ; శబ్దం కనుమరుగు కాగానే ఇంట్లోకి పోవాల్సిందేనా ?

రాత్రంతా - ఆలోచన నులకమంచంమీద పొర్లుతూనే వుంది. వెలిసిపోయిన గుడ్డలా అయింది మనస్సు. అమ్మ ముందు ఏడుపు సరేసరి.

వేగుచుక్క పొడిచింది.

అప్పుడన్నది అమ్మ ; " నీకంత గట్టిగా చదువుకోవాలనే వుంటే, మన భాగం అంతా అమ్మేసి పట్నం వెళ్ళిపోదాం. బాబాయితో మాట్లాడుతాలే ; ఊరుకో. "

నా మొహాన్న తొలి వెలుగు తోచింది.

మధ్యాహ్నం ఈ చర్చ అంతా ముళ్ళకంచెలాగా తయారైంది. మేం చేయబోయే పనిని ఎవరూ సమర్థించలేదు. "వాడు పసివాడు. వాడికేందో చదువుకోవాలనే వుంటుంది. కానీ, నువ్వూ వాడికి వంతపాడి, ఇట్టా వెనకా ముందూ చూసుకోకుండా-కుండా కూడు - వదిలేసి పోతాననడం ఏం బాగాలేదు. " అని అమ్మని నానా చివాట్లు పెట్టారు - చనువున్న నలుగురూ.

అమ్మ ఒక్కటే మాటమీద వుంది. " వాడు చదువుకుంటానంటున్నాడు. చెప్పించడం నా ధర్మం. "

బాబాయికి కోపమొచ్చింది. " అవును. చదువుకుని ఏం చేస్తాట్ట, చంకనాకుతాడు ? అ చేసేదేదో ఇప్పుడు చదివిన దాన్తోనూ ఏడ్వవచ్చు. ఇంకా ఎందుకుట-ఆ కాలేజీ చదువులు ? "

పొగలోంచి నిప్పు కణకణలాడింది, మంటా లేచింది.

అమ్మ నాకేసి చూసింది- ఏం చేస్తావన్నట్టు.

చుట్టూ చూశాను. అందరి చూపులూ నామీదే వున్నై. నాలో ఏదో మొండి ధైర్యం, తెగింపూ వచ్చేసినై. "ఏమీ చెయ్యలేకపోయినా - సరే, ఈ వూరంతటికీ మొట్టమొదటి, బియ్యే నవుతాను. సరేనా." వాతావరణంలో పిడుగుపడింది!

అంతా నివ్వెరపోయారు. బాబాయికి అంతా అచేతనంగా వుంది.

నేను మామూలు మనిషిగానే నిలబడి వున్నాను. నా గుండె గుండెలోనే వుంది. కళ్ళముందు ఏదో విజయచిహ్నం మెదలాడ సాగింది.

-రెండున్నర ఎకరాల మాగాణీ - పేరుగల భూమికి నాలుగున్నర వేలకీ, ఐదెకరాల మెట్టనీ ఒక వెయ్యికీ- బాబాయి, తానే తీసుకున్నాడు.

అమ్మ నన్ను తీసుకుని పట్నం వచ్చేసింది. నేను కాలేజీలో చేరేను.

నేను - కోరుకున్నట్లుగా - బియ్యేని కాగలిగేను. అమ్మ నా కోసం తన ఆరోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టకుండా-కుట్టుమిషన్ మీద పని చేసింది. తాను ఒకపూట తిని నాకు రెండు పూటలా అన్నం పెట్టింది. తానూ రెండు పూటలా తినగలిగిననాడు- నాకు మూడో పూటకూడా పెరుగు ముద్దలు పెట్టింది.

గవర్నమెంటు నౌకరీలో చేరాను.

అమ్మ బాబాయికి ఉత్తరం రాసింది. అవును-తన కొడుకు ఆ వూరంతకీ మొదటి పట్టభద్రుడౌతాడన్న కలని పండించుకున్నాడు ! అందుకు, ఆమె - కళ్ళని ఆనందంతో చెమర్చుకుంది.

బాబాయి ఉదాసీనంగా ఊరుకున్నాడు. అమ్మ బాధపడింది. నేనే ఆమెకు నచ్చచెప్పేను ; ధైర్యం చెప్పేను.

పెళ్ళి పేరంటం జరిగాయి. అప్పుడూ బాబాయి అయిపులేడు.

శారద రామసీతని ప్రసవించిన వొక నెలకో ఏమో అమ్మ పోయింది. నేను బాబాయికి ఉత్తరం రాసి పోస్ట్‌లో వేశాను. ఎన్నాళ్ళకూ ఎలాంటి సమాధానమూ రాలేదు. ఇప్పుడు రామసీత బీకాం పూర్తి చేసింది. ఆమె పెళ్ళికి సంబంధాలు చూస్తున్నా నేను !

* * *

- తుండుతో కళ్ళొత్తుకుని, మొహం తుడుచుకున్నాను.

శారద వచ్చింది. ఖాళీ కప్పును తీసుకుని వంటింట్లోకి వెళ్తూ, " సెలవు సంగతీ అదీ చూసుకోండి. సీత, సునీత, రాజు, చంద్రం కూడా మనతో వస్తామని ఉబలాట పడుతున్నారు. అందరమూ కలిసే వెళ్దాం. " అంది.

ఉమాపతి రాసినట్టే - ఉగాదికి రెండ్రోజులు ముందు - మా వూరు చేరుకున్నాము. ఉమాపతీ-అప్పటికి నాలుగునాళ్ళ క్రితమే వచ్చేశాడట. అతని భార్య సుందరి. వాడికీ ముగ్గురు పిల్లలు-

శారదా, సుందరీ క్షణాల్లో కలిసిపోయేరు. పిల్లలు సరేసరి.

ఊరిని తలచుకుంటే నాకే ఆశ్చర్యం వేసింది. ఊసర క్షేత్రాల్లా వుండే పొలాలు కళకళ్ళాడుతూ పచ్చగా మారినై, తోటలూ వచ్చినై. రకరకాల పళ్ళూ, కాయలూ, అరటీ వేస్తున్నారట. కొంతమంది పత్తిమీద రాబడి బాగానే తీస్తున్నారట. బస్‌రోడ్డు నుంచీ ఊళ్ళోకి తార్రోడ్డు పడింది. పక్కగా అటూ ఇటూ గలగల పారుతున్నై – పంటకాలవలు. వీధి దీపాలూ, రేడియో సెంటరూ, కాలేజీ బిల్డింగూ, మిల్క్‌చిల్లింగ్ సెంటరూ– అన్నీ నాకు రంగుల కలలో చిత్రాల్లా తోచినై.

ఉమాపతి ఇల్లూ అలాగే కొత్త అందాల్ని సంతరించుకుంది. కాంక్రీటు భవనం. అన్ని వసతులూ వున్నై. ప్రాంగణమంతా శుభ్రంగా వుంది.

బాబాయీ, పిన్నీ - లేరనే లోటు తప్ప - ఆ యింట్లో మరో లోటే కనపళ్ళేదు.

—డాబామీద పడుకుని కబుర్లాడుకుంటున్నాం, నేనూ, ఉమాపతీ.

"ఇదంతా సాగర్ పుణ్యమే అన్నయ్యా. సాగర్ నీళ్ళొచ్చి మన ప్రాంతాన్నంతా ఒక్కసారి మాయాబజార్లా మార్చేసినై. రెండేళ్ళనుంచీ పల్లపు భూమిలో పాతిక బస్తాలు కనీస దిగుబడి వుందిప్పుడు. మెట్టలో పసుపు వేస్తున్నాం. ఎకరం పాతికవేలు

పలుకుతోంది-పొలం ధర. ఢిల్లీలో వుంటున్నా, ఇక్కడి వ్యవహారాలకోసం నేను వచ్చి పోతూనే వున్నాను, అడపా దడపా. ముఖ్యమైన పనులన్నీ మా మావగారు చూసుకుంటున్నారు. ఈ ఇల్లు కట్టడపు పనంతా ఆయనే చూశారు. "

నేను ఆలోచనతో, ఆశ్చర్యంతో పరధ్యానంగా వున్నట్లు గమనించినట్లున్నాడు ఉమాపతి. చెప్పడం ఆపేడు.

గోవుల్ని మళ్ళించిన అర్జునుడిలా తోచేడు నాకు ఉమాపతి.

పండగ వెళ్ళిపోయింది, ఎంతో సరదాగా, సంబరంగా. అందరికీ ఖరీదైన కొత్త బట్టలు! ఊళ్ళో చదువుకున్న వాళ్ళంతా నా పిల్లల్నీ, ఉమాపతి పిల్లల్నీ చూసి ముత్యాల్లా వున్నారని మురిసిపోయారు. శారదా, సుందరీ వాళ్ళందరూ చూడ చక్కని అక్కా చెల్లెళ్ళు!

తండ్రుల చాలు రాకుండా, సంతానవంతులమైనందుకు వో పెద్దాయన నన్నూ ఉమాపతినీ అభినందించాడు—బజార్న పోతుంటే ఆపి, మాట్లాడి!

పంచమినాడు మా తిరుగు ప్రయాణం. ఉమాపతికి ఇంకా నెలవుంది.

ఆరోజు-మధ్యాహ్నం భోజనాలై హాల్లో కూర్చున్నాం.

బయటనుంచి ఎండ కాస్తున్నా, అక్కడ చాలా ప్రశాంతంగా, చల్లగా వుంది. ఏవో మాటలు సాగుతున్నై.

ఉమాపతి లేచి లోపలికి వెళ్ళాడు. క్షణాల తర్వాత గదిలోనుంచీ బయటికి వచ్చేడు ఉమాపతి.

" ఈ వూరు విడిచి వెళ్తా వెళ్తా అన్నావుట నువ్వు. ' ఏమీ చెయ్యలేకపోయినా, ఈ వూరంతకీ మొట్టమొదటి బియ్యే నవుతా'నని. నాన్న అంటూ వుండేవాడు. నీ మాటలు ఆయనలో గొప్ప మార్పునే తెచ్చినై. అది తలచుకుంటూనే ఆయన నన్ను ఈ వూరంతకీ మొట్టమొదటి ఇంజనీరుని చేశారు. ఆ విధంగా నేన్నీకు ఎంతో ఋణపడి వున్నాను " ఉమాపతి స్వరం మారింది. కృతజ్ఞతతోపాటు, ఆరాధనాభావమూ కదలాడింది.

నేను విస్తుపోయాను. గట్టిగా కళ్ళు మూసుకున్నాను. క్రమంగా-మేధస్సులో ఎక్కడో దీపం-దీపం వెలుగు-ప్రకాశవంత మౌతున్నట్లైంది.

నిముషాల తర్వాత అన్నాడు, ఉమాపతి—"రెండేళ్ళనుంచీ పొలంమీద ఫలసాయం లెక్కకట్టి వుంచాము. ఇదిగో ఇదంతా మీది. ఇవి మీ భూమి తాలూకు డాక్యుమెంట్స్ " రెండు కవర్లు నా చేతిలో వుంచేడు.

జరిగిందీ, జరుగుతున్నదీ ఏమిటో నాకు తెలియడంలేదు.

" ఇదంతా మీ మరదలి నిర్ణయం. కాదని మాకు మనస్తాపం కలిగించరనే నమ్మకం. వదినా, నీకూ ఇదే నా మాట. "

ఛాయస్‌లేని ప్రశ్నాపత్రం అందుకుని, పరీక్ష హాల్లో దిక్కులు చూస్తున్న విద్యార్థి పరిస్థితిలా వుంది—నా అవస్థ !

అమ్మ కళ్ళముందు నిలిచింది-ఆనాటి నా నిర్ణయానికి వెన్నెముక !

సుందరి ఎదురుగా నిలబడి వుంది—ఈనాటి ఉమాపతి నిశ్చయానికి ప్రాతిపదిక !

ఎప్పుడో చదివిన వాక్యం గుర్తు కొచ్చింది, 'ప్రపంచంలో పురుషుడు సాధించిన ప్రతి మంచి పని వెనుకా ఒక స్త్రీ సహకారం, త్యాగం, సహనం ఇమిడివున్నై !' అవును—

అందుకనే ఉగాదులు నా గుండెల్లో అమృతపు చినుకులు కురుస్తై ! !

0~0~0